నేడు సద్దుల బతుకమ్మ

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి సాంప్రదాయం ప్రకారం అమావస్యకు ముందురోజు బతుకమ్మను ఆడుతుంటారు. ఈసారి రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం సద్దుల బతుకమ్మ ప్రకటించినప్పటికీ కూకట్‌పల్లిలో ఆచారం ప్రకారం మంగళవారం గౌరమ్మను బయటకు తీసుకురాకూడదనే ఉద్దేశంతో సోమవారమే సద్దుల బతుకమ్మ నిర్వహిస్తున్నట్లు కూకట్‌పల్లి బతుకమ్మ ఉత్సవ కమిటీ సభ్యులు నాయినేని శ్రీనివాసరావు, కంచనపల్లి నాగరాజు, నాయినేని సూర్యారావు ప్రకటించారు.

కాలనీ కమాన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే



కూకట్‌పల్లి: బాలాజీనగర్ డివిజన్ టీవీఆర్ కాలనీ కమాన్‌ని ఆదివారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రారంభించారు. కార్యక్రమంలో మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మా రెడ్డి, మాజీ కార్పొరేటర్ పగడాల బాబురావు, టీవీఆర్ కాలనీ సభ్యులు పాల్గొన్నారు.

మన్‌కీ బాత్ వీక్షించిన నేతలు



కార్యక్రమంలో పాల్గొన్న రాజ్యసభ సభ్యులు డాక్టర్ లక్ష్మణ్, బీజేపీ నాయకులు

కూకట్‌పల్లి: వివేకానందనగర్ డివిజన్ అధ్యక్షులు డాక్టర్ ఎస్. వంశీరెడ్డి సమక్షంలో హనుమాన్‌శక్తి కేంద్రం ఇన్‌చార్జి పి. నాగేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం మన్ కీ బాత్ కార్యక్రమం వివేకానందనగర్ క్లబ్ హౌస్‌లో ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజ్యసభ సభ్యులు డాక్టర్ లక్ష్మణ్ విచ్చేశారు. డివిన్‌లోని నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాధవరం కాంతారావు, వడ్డేపల్లి రాజేశ్వరరావు, కొరదాల నరేష్ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం



ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేస్తున్న కార్పొరేటర్ నర్సింహయాదవ్

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ పరిధిలోని పి. రాములుకు మంజూరైన రూ.రూ. 2.50 లక్షల ఎల్‌ఓసీ పత్రాన్ని ఆదివారం కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ కుటుంబ సభ్యులకు అందజేశారు. పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

శరన్నవరాత్రోత్సవం.. భక్తుల సంబురం



మోతీనగర్‌లోని శంకరమఠంలో గజలక్ష్మి అమ్మవారిగా..

నియోజకవర్గ వ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం పలు అమ్మవార్ల ఆలయాలు, దుర్గామాత మండపాల్లో విశేష పూజలు జరిగాయి. ఆలయాల్లో మహాచండీ హోమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.
– కూకట్‌పల్లి జోన్‌బృందం



వెంకటేశ్వరనగర్‌లోని అమ్మవారి పూజలో కార్పొరేటర్ మాధవరం రోజాదేవి



మూసాపేట యాదవ బస్తీలోని అమ్మవారి పూజలో పాల్గొన్న స్థానికులు



గణేష్ నగర్‌లో వనదేవత పూజలో కార్పొరేటర్ సబిహా బేగం తదితరులు



దత్తాత్రేయ కాలనీలోని అమ్మవారి పూజలో నాయకులు



ఎన్‌టీఆర్‌నగర్‌లోని శ్రీసంత్ రవిదాస్ మందిర్‌లో ..



ఫతేనగర్ డివిజన్ గౌతంనగర్ హనుమాన్ ఆలయంలో అన్నదానంలో కార్పొరేటర్ సతీష్ గౌడ్



బాలానగర్ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద .. కార్పొరేటర్ రవీందర్ రెడ్డి



మల్లికార్జుననగర్‌లో అమ్మవారిని దర్శించుకుని పూజలు చేస్తున్న నాయకులు

భగత్‌సింగ్ జీవితం స్ఫూర్తిదాయకం



పాండురంగా నగర్‌లో నివాళులు అర్పించిన కార్పొరేటర్ మహేందర్ తదితరులు



రాధాకృష్ణన్ చౌరస్తాలో నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు తదితరులు

జయంతి సందర్భంగా నివాళులర్పించిన నేతలు, సంఘాలు

కూకట్‌పల్లి (జోన్‌బృందం): స్వాతంత్ర్య సమరయోధుడు, దేశం కోసం తన ప్రాణాలను అర్పించిన భగత్ సింగ్ జయంతిని వివిధ ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. స్వాతంత్ర్యం కోసం అశువులు బాసిన వీరులు ఎందరో ఉన్నారని, వారిలో భగత్ సింగ్ సుఖ్‌దేవ్, రాజ్‌గురు మహనీయులు ఉరికంబాన్ని ముద్దాడుతూ ప్రాణత్యాగం చేశారని నాయకులు వివరించారు.నేటి యువత వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు.



కూకట్‌పల్లిలో..



వెంకట్రావ్‌నగర్ కాలనీలో..

భరత్‌నగర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నాగిరెడ్డి విజయం



మూసాపేట: భరత్‌నగర్ కాలనీ అసోసియేషన్ ఎన్నికలలో పి. నాగిరెడ్డి 44 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. కాలనీలో 660 ఓట్లు ఉండగా 600 ఓట్లు పోల్ అయ్యాయి. 8 ఓట్లు చెల్లలేదు. పి. నాగిరెడ్డి ప్యానెల్‌కు 318 ఓట్లు, కె. భిక్షపతికి 274 ఓట్లు పోల్ అయ్యాయి. 44 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. కాలనీ అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తామని అన్నారు.

కార్యకర్తకు పరామర్శ

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని రామారావు నగర్‌కు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త పి. శివయ్య అనారోగ్యంతో ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబిహా బేగం ఆదివారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. కార్యకర్తల కష్టసుఖాల్లో తాను తోడుగా ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో నాగుల సత్యం, రాజుచారి, యశ్వంత్, వెంకటయ్య యాదవ్, రామ్‌రెడ్డి, సంజీవ, యోగి తదితరులు పాల్గొన్నారు.

రేబిస్ ఉచిత వ్యాక్సినేషన్

నిజాంపేట్: వరల్డ్ రేబిస్ డే సందర్భంగా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో బ్లూ క్రాస్ ఆఫ్ హైదరాబాద్, మిషన్ రేబిస్ సంస్థల సహకారంతో ఆదివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. వీధి కుక్కలకు, పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్ నిరోధక టీకాలు వేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బ్లూ క్రాస్ ఆఫ్ హైదరాబాద్ ఫౌండర్ అండ్ చైర్‌పర్సన్ అమలా అక్కినేని, నిజాంపేట్ మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీ హాజరయ్యారు. ఈ సందర్భంగా అమల అక్కినేని మాట్లాడుతూ.. వ్యాధిని అరికట్టడానికి ఒకే మార్గం వ్యాక్సిన్ వేయడమే అని, వీధి కుక్కలకు నియంత్రణ చికిత్సలు చేసి, వాటిని తిరిగి వాటి ప్రదేశాల్లో వదిలిపెట్టడం ద్వారా కమ్యూనిటీలకు రక్షణ లభిస్తుందన్నారు. కమిషనర్ అలీ మాట్లాడుతూ.. స్వచ్ఛంద సంస్థలతో పాటు ప్రజల సహకారం అవసరమని, సమిష్టిగా కృషి చేసి వీధి కుక్కలకు సంతాన నిరోధక చికిత్సలు, యాంటీ రేబిస్ టీకాలు వేయించడం ద్వారా ప్రజలకు రక్షణ లభించడంతో పాటు వీధి కుక్కల సంతానం కూడా నియంత్రణలోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో మిషన్ రేబిస్ నుండి రింకిల్ బ్లమిటా లోబో, ఎస్ఎంసీ మేనేజర్ శ్యాంసుదర్, శానిటేషన్ అధికారులు, సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.



వ్యాక్సినేషన్‌లో అమలా అక్కినేని, కమిషనర్ సాబేర్ అలీ

విదేశీ పూలు.. వింతైన బతుకమ్మ!

- భారీ బతుకమ్మల ఏర్పాట్లకు ముస్తాబైన కూకట్‌పల్లి
- నేడు సద్దుల బతుకమ్మ



రంగధాముని చెరువు బతుకమ్మ ఘాట్ వద్ద ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

కూకట్‌పల్లి: అచ్చమైన పూలు లభించడమే అరుదు. అసలే మహానగర ప్రాంతంలో కాంక్రీట్ జంగిల్‌గా మారిన ప్రాంతాలలో పూల పండుగ కోసం మహిళలు పోటీ పడి పెద్ద పెద్ద బతుకమ్మలను పేర్చి ప్రత్యేకతను చాటుకున్నారు. తెలంగాణలో హైదరాబాద్ నగరం చుట్టూ పంట పొలాలు పూర్తిగా ప్లాట్‌లుగా మారిపోయి రియల్ ఎస్టేట్ వ్యాపారం నగరానికి 40 కిలో మీటర్ల దూరం వరకు విస్తరించింది. దీంతో బతుకమ్మ వేడుకల కోసం పూలు లభించక ఇతర రాష్ట్రాలకు సైతం వారం రోజులు ముందే గాలింపు చర్యలు చేపడుతున్నారు. తెలంగాణ సాంప్రదాయం ఉట్టిపడేలా బతుకమ్మ వేడుకలు నిర్వహించే కూకట్‌పల్లిలో లక్షల రూపాయలు వెచ్చించి ఇక్కడ అచ్చమైన పూలతో బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తారనటంలో సందేహం లేదు. అంతేకాకుండా 15 అడుగుల నుంచి 20 అడుగుల వరకూ సుమారు 50 బతుకమ్మలను పేర్చి తెలంగాణలోనే రికార్డు సాధించిన ఘనత కూకట్‌పల్లి ప్రాంతానికి దక్కింది. అయితే తమ సాంప్రదాయాలను ఏ మాత్రం తీసిపోకుండా కొంత మంది మహిళలు జిల్లాలను దాటడమే కాకుండా రాష్ట్రాలను దాటి పూలను సేకరిస్తున్నారు. జమ్ముకాశ్మీర్, ఉత్తర ప్రదేశ్, పంజాబ్, చండీగఢ్‌లతో పాటు పూలతోటల వద్దకు వెళ్లి పూలను సేకరించి భారీ బతుకమ్మలను ఏర్పాటు చేస్తున్నారు.



గత సంవత్సరం హంస ఆకారంలో తీర్చిదిద్దిన భారీ బతుకమ్మ (ఫైల్)

◆ కూకట్‌పల్లికి చెందిన గుండాల అర్చన మరో అడుగు ముందుకేసి మూడు సంవత్సరాలుగా విదేశాల నుంచి వింతైన పూలను సేకరించి బతుకమ్మను పేర్చటం విశేషం. అర్చన వారం రోజులకు ముందే విదేశాల్లో ఉన్న తమ స్నేహితుల వద్ద నుంచి పూలను తెప్పించుకోవటం జరుగుతుంది. న్యూజిలాండ్, బ్యాంకాక్, సింగపూర్, దుబాయ్ వంటి పలు దేశాల నుంచి వింతైన పూలను సేకరించి సుమారు 18 అడుగుల వరకూ బతుకమ్మలను పేర్చి ఆకట్టుకుంటున్నది. ఈ సంవత్సరం కూడా ఏ మాత్రం తీసిపోకుండా కాశ్మీర్, కన్యాకుమారి, కొడైకెనాల్, ఊటీ, బెంగుళూర్ తదితర ప్రాంతాలతో పాటు విదేశాల నుంచి సేకరించిన పూలతో బతుకమ్మలను పేర్చనుంది. 40 సంవత్సరాలుగా తమ అత్త చంద్రమ్మ చేపట్టిన సాంప్రదాయాన్ని ఏ మాత్రం వదలకుండా ఇప్పటికీ కొనసాగిస్తూ ఈసారి కూడా భారీ బతుకమ్మ ఏర్పాటుకు సిద్ధమవుతోంది. రెండు రోజులుగా గుండాల అర్చన నాగరాజు దంపతులు సుమారు 15 మంది కార్మికులతో కలిసి భారీ బతుకమ్మ ఏర్పాటుకు సిద్ధం చేశారు. కూకట్‌పల్లిలో గత 25 సంవత్సరాలుగా బతుకమ్మ వేడుకలకు ఎంతో క్రేజ్ ఉంది. ఈ సారి కూడా బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఇప్పటికే పూర్తి స్థాయి ఏర్పాట్లు చేశారు.

వెంకటేష్‌కు కళా నటరత్న పురస్కారం



వెంకటేష్‌కు పురస్కారాన్ని అందజేస్తున్న సర్వేశ్వరా నాట్యమండలి నిర్వాహకులు

కూకట్‌పల్లి: సర్వేశ్వరా నాట్యమండలి వారు దేవి నవరాత్రుల సందర్భంగా నిర్వహించిన నాటక ప్రదర్శన అనంతరం అరికట్ల వెంకటేష్‌కు కళా నటరత్న పురస్కారాన్ని ఆదివారం అందజేశారు. 1999లో మొట్టమొదట నాటక రంగానికి ప్రవేశించి ఇప్పటి వరకు కొన్ని వందల సంఖ్యలో నాటిక, నాటకాలు ప్రదర్శించారు. అదే విధంగా కస్తూరి సీరియల్‌లో రంగప్రవేశం చేసి ఎన్నో హిట్ సీరియల్స్‌లో నటించారు. ఈ మధ్య కాలంలో విడుదలైన ఓదేల –2, భైరవంలో నటించారు. దాదాపు 60 సినిమాలలో నటించారు. ఎన్నో నాటకాలు, నాటికల్లో నటించినందుకు గాను కళా నటరత్న అవార్డు ఇచ్చి సత్కరించారు.

పేదలకు చేయూతనివ్వాలి



కార్యక్రమంలో పాల్గొన్న భవసార ఖత్రియ సమాజం నాయకులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి వివేక్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో భవసార ఖత్రియ సమాజం ఆధ్వర్యంలో ఆదివారం విశేషమైన సేవా కార్యక్రమం జరిగింది. 100 బస్తాల బియ్యం, 100 బస్తాల ఆశీర్వాద్ పిండి, 100 చీరలు పంపిణీ చేశారు. కలేకర్ కృష్ణారావు, సుమన్ విరాళం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న వారికి చేయూత ఇవ్వటం తమ కుటుంబ సంప్రదాయమని పేర్కొన్నారు. ఇటువంటి కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయన్నారు. భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో సమాజ అధ్యక్షుడు డొలగర్ శ్రీనివాస్, ఆస్టికర్ రఘునాథ్, మహేంద్రకర్, కమలాకర్, ఆకోడే నవీన్, జంబునాథ్ పాల్గొన్నారు.

కార్మికులకు చీరల పంపిణీ



చీరలను పంపిణీ చేస్తున్న పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: డివిజన్ పరిధిలోని ఆడపడుచులకు బతుకమ్మ, దసరా పండుగలు ఆనందంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో గోదాకృష్ణ ఫంక్షన్ హాలులో ఆదివారం పీఏసీ చైర్మన్ గాంధీ కార్పొరేటర్‌లు దొడ్ల వెంకటేష్ గౌడ్, నార్నే శ్రీనివాసరావుతో కలిసి మహిళలకు చీరల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ సహకారంతో చీరలు అందజేసినట్లు తెలిపారు.కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

పాపిరెడ్డినగర్‌లో...

పాపిరెడ్డి నగర్ బస్తీ అధ్యక్షులు ఊట్ల చంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం పారిశుద్ధ్య కార్మికులకు బతుకమ్మ పండుగ పురస్కరించుకొని చీరలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెల్ఫేర్ అసోసియేషన్, ఆలయ కమిటీ సంయుక్తంగా పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి భగవంత్‌రెడ్డి, కోశాధికారి నర్సింలు ముదిరాజ్, ఆలయ కమిటీ చైర్మన్ పేర్ని ధర్మారావు, సలహాదారులు అనంతర రాములు, ఆలయ కమిటీ అధ్యక్షులు ఆడెపు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



చీరలు అందజేస్తున్న పాపిరెడ్డినగర్ బస్తీ అధ్యక్షులు ఊట్ల చంద్రారెడ్డి



కార్మికులకు దుస్తులు అందజేస్తున్న కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు మారెల్ల శ్రీనివాసరావు

పీజేఆర్‌నగర్‌లో...

కాంగ్రెస్ ఆల్విన్‌కాలనీ డివిజన్ అధ్యక్షుడు మారెల్ల శ్రీనివాసరావు పారిశుద్ధ్య కార్మికులకు ఆదివారం దుస్తులను పంపిణీ చేశారు. పండుగను ఆనందంగా జరుపుకోవాలన్నారు.

తీరొక్క పూలు ఉయ్యాలో..

కూకట్‌పల్లి జంట సర్కిళ్ల పరిధిలో బతుకమ్మ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. కూకట్‌పల్లి తదితర ప్రాంతాల్లో మహిళలు, యువతులు బతుకమ్మలను వేదిక వద్దకు చేర్చి చుట్టు ఆడుతూ, పాడుతూ సందడి చేశారు. ఆటాపాటల అనంతరం కొలనులలో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. – కూకట్‌పల్లి



కూకట్‌పల్లి దేవిస్థాన విల్లాస్‌లో బతుకమ్మతో..



కూకట్‌పల్లి ఆర్టీసీ డిపోలో డిపో మేనేజర్ హరి, ఎంఎఫ్ బాలరాజు, మహిళా సిబ్బంది



బతుకమ్మతో..



బతుకమ్మ వేడుకల్లో ..కూకట్‌పల్లి సర్కిల్, రామారావు నగర్ మహిళలు

ఘనంగా ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది విజయదశమి ఉత్సవం



సాక్షి, సిటీబ్యూరో: కూకట్‌పల్లి పరిధి రాంనరేష్ నగర్ కాలనీలోని కమ్యూనిటీ హాల్లో ఆదివారం ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో శతాబ్ది విజయదశమి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన హోలిస్టిక్ హాస్పిటల్స్ చైర్మన్ డా. వీఎస్ రామచంద్ర మాట్లాడుతూ హిందువులందరూ ఐక్యంగా ఉండి సాధారణ పౌర నియమాలను పాటించాలని కోరారు. ప్రజలందరికీ విజయ దశమి శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యవక్తగా వచ్చిన డాక్టర్ మంచూరి అమర్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ 1925లో ఆవిష్కృతమైనన ఆర్‌ఎస్‌ఎస్ ఇప్పుడు దేశంలోని లక్ష గ్రామాలకు చేరిందని చెప్పారు. పౌరనియమాలు పాటిస్తూ..కుటుంబ విలువలు పెంపొందిస్తూ ఆర్‌ఎస్‌ఎస్ సమాజంలో ఉత్తమ పాత్ర పోషిస్తోందని చెప్పారు. ఈ ఉత్సవంలో 120 మంది 'గణేష్ ధారులు' పాల్గొన్నారు. 150 మంది మాతృమూర్తుల ఆధ్వర్యంలో లలితా సహస్రనామ పారాయణ జరిగింది. కాలనీ సొసైటీ అధ్యక్షుడు నక్కా శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు చాట్ల రవి, ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి పాల్గొన్నారు.

'మనూ' పరిశోధక విద్యార్థికి పీహెచ్‌డీ

రాయదుర్గం: మనూ పరిశోధక విద్యార్థికి పీహెచ్‌డీ డిగ్రీని ప్రకటించారు. ఉర్దూ విశ్వవిద్యాలయంలోని జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ విభాగంలో పరిశోధక విద్యార్థి అజ్మల్ అలీఖాన్ 'జాతీయ, ప్రాంతీయ హిందీ వార్తా ఛానెల్స్ యొక్క తులనాత్మక అధ్యయనం: లక్నో యొక్క వీక్షకుల దృక్పథం ' అనే అంశంపై ప్రొఫెసర్ మహ్మద్ ఫరియాద్ పర్యవేక్షణలో థీసిస్ సమర్పించారు. ఈ మేరకు ఆయనకు పీహెచ్‌డీని ప్రకటించారు.